# భారత ఆర్థిక వ్యవస్థ

## వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు

### బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ ఆధారిత పథకాలు

### ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (PMJDY)

దేశంలో అన్ని కుటుంబాలకు ఆర్థిక సేవలు అందిస్తూ, వారిని సమ్మిళిత ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీన్ని 2014, ఆగస్టు 28న ప్రారంభించారు. ఈ పథకం కింద పది సంవత్సరాలు పైబడిన ఎవరైనా నగదు డిపాజిట్ చేయకుండానే పొదుపు ఖాతా ప్రారంభించవచ్చు. ఈ పథకంలో 2017, జనవరి 11 నాటికి 26.68 కోట్ల పొదుపు ఖాతాలు నమోదయ్యాయి. ఇందులో 16.22 కోట్ల గ్రామీణ ప్రాంత ఖాతాలు, 10.46 కోట్ల పట్టణ ఖాతాలు ఉన్నాయి. మొత్తం 21 కోట్ల రూపే డెబిట్ కార్డులు జారీ చేశారు. దీనిలో 24.6 శాతం ఖాతాలు జీరో బ్యాలెన్స్‌తో ఉండగా, మొత్తం నిల్వ నగదు రూ. 69,027.17 కోట్లుగా ఉంది. దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారు ఖాతా ప్రారంభించేలా చేయడమే దీని ప్రధాన ఉద్దేశం.

### ప్రధాన మంత్రి సుకన్య సమృద్ధి యోజన (PMSSY)

బాలికల భవిష్యత్ భద్రత దీని ప్రధాన ఉద్దేశం. 'బేటీ బచావో బేటీ పడావో' నినాదంలో భాగంగా 2015, జనవరి 22న దీన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ఖాతాలు ప్రారంభించిన బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం, ఉన్నత విద్య కోసం 50 శాతం నిధులను ఉపసంహరించుకునే అవకాశం కల్పించారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్దేశించిన వడ్డీరేటుతో మిగిలిన మెచ్యూరిటీ మొత్తాన్ని 21 సంవత్సరాలు నిండిన బాలికలు పొందవచ్చు. సంవత్సరానికి రూ. 1,000 కనీస డిపాజిట్‌తో గరిష్ఠంగా రూ. 1.5 లక్షల వరకు డిపాజిట్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఒక కుటుంబంలో ఇద్దరు బాలికలకు దీన్ని అనుమతిస్తారు. ఒకవేళ తల్లిదండ్రులకు ఒకే కాన్పులో కవలలు పుడితే అదనంగా మరో బాలికకు అవకాశం కల్పిస్తారు. ఈ డిపాజిట్‌లకు ఆదాయపన్ను సెక్షన్ 80c కింద మినహాయింపు లభిస్తుంది.

### ప్రధానమంత్రి ముద్ర యోజన (PMMY)

సూక్ష్మ పరిశ్రమల వృద్ధికి తగిన ఆర్థిక మద్దతు కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. దేశంలోని అన్ని ప్రధాన బ్యాంకు బ్రాంచీల ద్వారా అమలు చేసేందుకు 2015, ఏప్రిల్ 8న దీన్ని ప్రారంభించారు. మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ రీఫైనాన్స్ ఏజెన్సీ (MUDRA) అనే ఈ పథకంలో నాన్-కార్పొరేట్ చిన్న వ్యాపార వర్గాల వారికి ఆర్థిక మద్దతు ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా ఇటీవల ఆసక్తి కలిగిస్తున్న స్టార్టప్‌లు/ అంకుర సంస్థలను ప్రోత్సహించడానికి 3 విభాగాల కింద ఆర్థిక సహాయం అందజేస్తారు.

(i) శిశు (Shishu): రూ. 50 వేల వరకు పెట్టుబడి అవసరమైన సంస్థలు

(ii) కిషోర్ (Kishor): రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల పెట్టుబడి అవసరమైన సంస్థలు

(iii) తరుణ్ (Tarun): రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల పెట్టబడి అవసరమైన సంస్థలు

ఈ విభాగాల కింద 2016, ఫిబ్రవరి 26 వరకు రూ. లక్ష కోట్ల నిధులను అందించారు.

### ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY)

ఈ పథకాన్ని 2015, మేలో ప్రారంభించారు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలలోపు భారతీయులను ఇన్సూరెన్స్ పరిధిలోకి తీసుకురావడం దీని ప్రధాన లక్ష్యం. వార్షిక ప్రీమియం రూ. 330తో రూ. 2 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తారు.

### ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (PMSBY)

ఈ పథకాన్ని 2015, మే 9న ప్రారంభించారు. 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాలలోపు భారతీయులకు వ్యక్తిగత ప్రమాద బీమా సదుపాయం కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. వార్షిక ప్రీమియం రూ. 12. ఒకవేళ ప్రమాదంలో చనిపోతే రూ. 2 లక్షల వరకు బీమా పరిహారం చెల్లిస్తారు. శాశ్వత పూర్తి అంగవైకల్యం సంభవించిన పరిస్థితుల్లో కూడా అంతే మొత్తం చెల్లిస్తారు. పాక్షిక అంగవైకల్యం కలిగినప్పుడు రూ. 1 లక్ష వరకు పరిహారం చెల్లిస్తారు. పై రెండు పథకాలను బ్యాంకు పొదుపు ఖాతాతో అనుసంధానం చేసి, ప్రతి సంవత్సరం వార్షిక ప్రీమియం చెల్లించేలా నిబంధనలు రూపొందించారు.

## అటల్ పెన్షన్ యోజన (APY)

ఈ పథకాన్ని 2015, మే 9న ప్రారంభించారు. ప్రైవేటు అసంఘటిత రంగంలో పని చేస్తున్న 18 నుంచి 40 సంవత్సరాలలోపు వారికి, ఇతరులకు వారి వయసు 60 సంవత్సరాలు దాటిన తర్వాత ప్రతి నెల రూ. 1000 నుంచి 5 వేల వరకు పెన్షన్ ఇవ్వడం దీని ప్రధాన ఉద్దేశం. లబ్ధిదారులు కనీసం 20 సంవత్సరాలపాటు వారు ఎంచుకున్న నెలవారీ పెన్షన్ మొత్తానికి తగిన విధంగా ప్రతినెలా చెల్లించాలి. దీన్ని బ్యాంకు పొదుపు ఖాతాకు అనుసంధానిస్తారు. కనీస పెట్టుబడి, గరిష్ఠ ప్రయోజనం పొందడమనేది ఈ పథకం ప్రధాన లక్ష్యం.

## కిసాన్ వికాస్ పత్ర

ఈ పథకాన్ని 2015, మార్చి 3న పునఃప్రారంభించారు. వీటిని KVPs అంటారు. చిన్న మొత్తాల మదుపర్లకు తగిన పొదుపు భద్రత కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. రూ. 1,000, 5,000, 10,000, 50,000 ముఖ విలువ ఉన్న పొదుపు పత్రాల ద్వారా వీటిలో మదుపు చేయవచ్చు. దీనిలో పొదుపు చేసేందుకు ఎలాంటి పరిమితి లేదు. దీనిలో దాచుకున్న సొమ్ము 8 సంవత్సరాల 4 నెలలకు రెట్టింపు అవుతుంది. ఈ పెట్టుబడులకు ఎలాంటి పన్ను మినహాయింపు లభించదు.

## గోల్డ్ మానిటైజేషన్ పథకం (GMS)

భారతీయుల వద్ద ఉన్న అపార బంగారం నిల్వలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం దీని ప్రధాన ఉద్దేశం. దీనిలో ప్రజలు తమ వద్ద ఉన్న బంగారాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేసి, వాటి విలువ కనుగుణంగా తగిన వడ్డీని పొందవచ్చు.

2015 నవంబరులో ప్రారంభించిన ఈ పథకంలో కనీసం 30 గ్రాముల బంగారాన్ని కడ్డీలు, నాణేలు, ఆభరణాల రూపంలో డిపాజిట్ చేయవచ్చు. దీనికి గరిష్ఠ పరిమితి లేదు. వీటిపై సంవత్సరానికి 2.5% చొప్పున వడ్డీరేటు చెల్లిస్తారు.

## వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి సంబంధిత పథకాలు

### ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY)

జాతీయ వ్యవసాయ బీమా పథకం, నవీకరించిన జాతీయ వ్యవసాయ బీమా పథకాల స్థానంలో 2016, ఫిబ్రవరి 18న దీన్ని ప్రకటించారు. ప్రకృతి వైపరీత్యాలు ఇతర కరవు కాటకాలు, చీడ పీడలతో పంట నష్టపోయిన రైతులకు తగిన బీమా సదుపాయం కల్పించడం, తదనుగుణంగా తగిన పరిహారం చెల్లించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఇది ఖరీఫ్, రబీ (యాసంగి) పంటలకు వర్తిస్తుంది.

ఖరీఫ్ పంటలకు బీమా చేసిన మొత్తంలో 2%, రబీ (యాసంగి) పంటలకు 1.5%, వాణిజ్య, ఉద్యాన పంటలకు 5% రైతులు ప్రీమియంగా చెల్లించాలి. పంట నష్టం అంచనాకు జీపీఎస్, స్మార్ట్‌ఫోన్స్, డ్రోన్ కెమెరాలు, రిమోట్ సెన్సింగ్ లాంటి ఆధునిక పరిజ్ఞానం ఉపయోగిస్తారు. 25% వరకు క్లెయిమ్‌ల పరిష్కారం ద్వారా వ్యవసాయదారుల అకౌంట్‌లోకి నగదు బదిలీ అవుతుంది. పంట తదుపరి (Post harvest) నష్టాలకు బీమా వర్తిస్తుంది.

సమగ్ర పంటల బీమా పథకం – 1985, జాతీయ వ్యవసాయ బీమా పథకం – 1999, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం – 2007, నవీకరించిన జాతీయ వ్యవసాయ బీమా పథకం – 2010 దీనికంటే ముందు అమలైన పథకాలు.

### సంసద ఆదర్శ్‌గ్రామ్ యోజన (SAGY)

**(2014 అక్టోబరు 11)**

సాంఘిక, ఆర్థిక వ్యవస్థాపూర్వక అభివృద్ధితో కూడిన నమూనా గ్రామాలను తయారు చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దేశంలోని ఎంపీలందరూ తమకు నచ్చిన నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలను ఎంచుకుని, దత్తత తీసుకుని, వాటిని అన్నివిధాలా అభివృద్ధి పరచాలనేది దీని ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా మొదట 2016 నాటికి ఏదైనా ఒక గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. తదుపరి మూడు సంవత్సరాల్లో అంటే 2019 నాటికి రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రామాలను అభివృద్ధి చేయాలి. ఆ తర్వాత 2024 వరకు ఏడాదికి ఒక గ్రామం చొప్పున అభివృద్ధి చేసుకుని, వాటిని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి. పేద కుటుంబాలు తగిన ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేయాలి. ఇళ్లు లేనివారికి పక్కా ఇళ్లు, తగిన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలి. గ్రామాల్లో పదో తరగతి వరకు తగిన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన తరగతి గదుల నిర్మాణం జరగాలి. ప్రజలకు తగిన వైద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి. తాగునీరు, రక్షిత మంచినీటి సదుపాయాలు, రోడ్డు, విద్యుత్ సదుపాయాలు, గ్రంథాలయం, టెలికాం, ఇంటర్నెట్ సౌకర్యం లాంటివి కల్పించాలి. ఆధార్ కార్డులు, e-గవర్నెన్స్ సదుపాయాలు అందుబాటులో ఉంచాలి. ఆమ్ ఆద్మీ బీమా యోజన లాంటి సదుపాయాలు,

ప్రజా పంపిణీ, సాంఘిక భద్రతా పథకాలు, వివిధ రకాల పెన్షన్లను అర్హులైన అందరికీ అందేలా చూడాలి. గ్రామీణ ప్రజలు దురలవాట్లకు దూరంగా ఉండేలా కృషి చేస్తూ స్వచ్ఛ ఆరోగ్య గ్రామాలుగా చేయాలి.

## ప్రధానమంత్రి గ్రామ్ సించాయ్ యోజన (PMGSY)

**(2015 జులై 1)**

'Per Drop More Crop' నినాదంతో ప్రతి నీటి బిందువును సద్వినియోగపరిచే లక్ష్యంతో దీన్ని ప్రారంభించారు. ప్రతి రైతు భూమికి నీటి సదుపాయం కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. 2020 నాటికి రూ. 50 వేల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేయాలని సంకల్పించారు. సాగునీటి పారుదల రంగంలోకి తగిన పెట్టుబడులను ఆకర్షించడం, వ్యవసాయ యోగ్యమైన సాగుభూమిని విస్తరించడం, వాటికి తగిన నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావడం ఈ పథకం లక్ష్యాలు.

## మట్టి (Soil) హెల్త్‌కార్డ్ స్కీం

**(2015 ఫిబ్రవరి 17)**

వ్యవసాయదారులు తమ సాగుభూమి ఉత్పాదకత పెంచుకునేందుకు ఆయా పంట భూములకు తగిన పోషకాలు, ఎరువులు ఏ విధంగా ఉపయోగించాలో చెప్పడం దీని ఉద్దేశం. ఈ హెల్త్‌కార్డ్‌లో పంటకు సంబంధించిన సమగ్ర సమాచారంలో భాగంగా ఆ పంట భూమికి తగిన ఉత్పాదకాలను సూచిస్తారు. తగిన ఉత్పాదకత సాధించడానికి ఆయా నేలల స్వభావం, భూసారాన్ని బట్టి తగిన సూచనలను ఈ కార్డ్‌లో పొందుపరుస్తారు.

## శ్యామాప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ (SPMRM)

**(2016 ఫిబ్రవరి 21)**

వచ్చే మూడు సంవత్సరాల్లో, గుర్తించిన 300 గ్రామీణ క్లస్టర్లలో పట్టణ ప్రాంతాల్లో లభించే సదుపాయాలను అందజేయడం దీని ప్రధాన ఉద్దేశం. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, ఉపాధి, మెరుగైన జీవన సౌకర్యాల కల్పన ప్రధాన లక్ష్యం. 25 వేల నుంచి 50 వేల జనాభా ఉన్న మైదాన ప్రాంత, కోస్తా తీరం వెంబడి ఉన్న గ్రామ పంచాయతీలను, 5 వేల నుంచి 15 వేల జనాభా ఉన్న ఎడారి, కొండ ప్రాంతాల్లోని ఆవాసాలను క్లస్టర్లుగా ఎంపిక చేస్తారు. నైపుణ్యాభివృద్ధితో కూడిన ఆర్థిక కార్యకలాపాల ద్వారా 14 అంశాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి యువతకు తగిన శిక్షణ కల్పిస్తారు.

**ఉదా:** డిజిటల్ అక్షరాస్యత, అంతర్ గ్రామీణ రోడ్ల అనుసంధానం, సిటిజన్ సర్వీస్ సెంటర్లు, ఎలక్ట్రానిక్ గ్రామ అనుసంధానం లాంటి అంశాల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తారు.

## రాష్ట్రీయ గోకుల్ మిషన్ (RGM)

**(2014 డిసెంబరు 16)**

12వ ప్రణాళికలో భాగంగా నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ బొవైన్ బ్రీడింగ్ అండ్ డెయిరీ డెవలప్‌మెంట్ కోసం రూ. 500 కోట్లు కేటాయించారు. పాలు, పాల ఉత్పత్తులను దేశీయంగా పెంచే ఉద్దేశంతో ఈ మిషన్‌ను ప్రారంభించారు. ఆవులు, గేదెల లాంటి పశుగణాభివృద్ధిని పెంచడం దీని ప్రధాన లక్ష్యం. దేశీయ పశుగణాభివృద్ధిని ప్రోత్సహించి పాల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడానికి గిర్, సహివాల్, రాటి, ఎర్రసింధి, థర్‌పార్కర్, డియోని లాంటి మేలుజాతి పాలిచ్చే జీవులను, బ్రీడ్‌లను అభివృద్ధి చేస్తారు. వీటి కోసం జన్యుపరంగా ఎటువంటి వ్యాధులు సంక్రమింపజేయని మేలుజాతి ఎద్దులను సరఫరా చేయడం ఈ మిషన్ ప్రధాన ధ్యేయం. ఇందుకోసం 'గోకుల్ గ్రామ్' లాంటి పశుగణాభివృద్ధి సెంటర్లను బలోపేతం చేయాలని నిర్ణయించారు. అలాగే 'గోపాల్‌సంఘ్' అనే బ్రీడర్ సొసైటీలను ఏర్పాటు చేస్తారు. వీటి కోసం రైతులకు తగిన ప్రోత్సాహకాలను అందిస్తారు. రైతులు, బ్రీడర్స్ సొసైటీలకు 'గోపాల్ రత్న', 'కామధేను' లాంటి అవార్డులు కూడా అందిస్తారు. దేశీయ పశుగ్రామీణాభివృద్ధికి తగిన సాంకేతిక శిక్షణ అందించడం ఈ మిషన్ ప్రధాన ధ్యేయం. ముఖ్యంగా 'గోకుల్ గ్రామ్'ల ఏర్పాటు ద్వారా పాలు, ఆర్గానిక్ పంటలకు వర్మీ కంపోస్ట్ తయారీ చేపట్టాలని నిర్ణయించారు.

## రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (RGSA)

2007లో ప్రారంభమైన రాజీవ్ గాంధీ పంచాయతీ స్వశక్తికరణ్ అభియాన్ పథకంలో భాగంగా ఇది కొనసాగుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి దీన్ని ఉద్దేశించారు. దేశంలో 2.85 లక్షల గ్రామపంచాయతీల్లో వాటి పాలనను

ప్రజాస్వామ్యబద్ధంగా దిగువ స్థాయి వరకు బలోపేతం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. పంచాయతీ వ్యవస్థలో గ్రామసభలను బలోపేతం చేయడానికి సామర్థ్యానికనుగుణంగా వాటి పారదర్శకత, అకౌంటబిలిటీ పెంపొందేలా చేస్తారు. ముఖ్యంగా గ్రామపంచాయతీలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం ఈ పథకం ప్రధాన ధ్యేయం. రూ.655 కోట్ల కార్పస్‌ఫండ్‌తో కేంద్రం, రాష్ట్రాలు 75 : 25 నిష్పత్తిలో పంచాయతీల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తాయి.

## గ్రామ్ ఉదయ్‌సే భారత్ ఉదయ్ అభియాన్

**(2016 ఏప్రిల్ 14)**

డా. బి.ఆర్.అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా గ్రామీణ స్వపరిపాలనా ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో 'సోషల్ హార్మోనీ పథకంలో' భాగంగా అంబేద్కర్ జన్మస్థలమైన మధ్యప్రదేశ్‌లోని మో (Mhow) గ్రామంలో దీన్ని ప్రారంభించారు. దీని ద్వారా వివిధ ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు ప్రారంభించడం, సాంఘిక న్యాయంపై అవగాహన కల్పించడంపై దృష్టి సారించారు. తదుపరి 2016, ఏప్రిల్ 17 నుంచి 20 వరకు 'గ్రామీణ వ్యవసాయదారుల అసెంబ్లీ' ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని ప్రమోట్ చేసేందుకు అవగాహన కల్పించారు. గ్రామసభల సమావేశాలు 2016 ఏప్రిల్ 21 – 24 మధ్య ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రభాత సమయంలో పాదయాత్రల ద్వారా వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. జంషెడ్‌పూర్ గ్రామీణులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ 2016, ఏప్రిల్ 24 ను 'పంచాయతీరాజ్ దినోత్సవం' గా ప్రకటించారు.

## దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన (DDUGJY)

రాజీవ్‌గాంధీ గ్రామీణ విద్యుద్దీకరణ యోజనను (RGGVY) ఈ పథకంలో విలీనం చేశారు (2015, జులై 25). గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయడం దీని ప్రధాన ఉద్దేశం. వ్యవసాయానికి కూడా నిరంతర విద్యుత్ సరఫరా దీని ప్రధాన లక్ష్యం. గ్రామీణ కుటుంబాలు, వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు ద్వారా తగిన విద్యుత్ సరఫరాను అందిస్తారు.

**రచయిత: దాడి నారాయణరావు**

www.eenadupratibha.net